క్లుప్తంగా

రేపటి నుంచి 'భూ భారతి' సదస్సులు

తుర్కపల్లి : భూ సమస్యల పరిష్కారానికి రేపటి నుంచి 20వ వరకు ప్రభుత్వం భూ భారతి, రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ దేశ్యానాయక్ ఆదివారం తెలిపారు. 3న నాగాయిపల్లి, గోపాలపురం, 4న కొండపూర్, శ్రీనివాస్‌పూర్, 5న వాసాలమర్రి, తిర్మాలపురం, 9న మాదపూర్, చిన్నలక్ష్మాపూర్, 10న తుర్కపల్లి, మాల్యాపూర్, 11న దత్తాయిపల్లి, కోమటికుంట, వెంకటాపూర్, 12న ఇబ్రహింపూర్, కోనాపూర్, 13న వేల్పుపల్లి, ధర్మారం, 16న రుస్తాపూర్, 17న గందమల్ల, 18న వీరారెడ్డిపల్లి, 19న ముల్కలపల్లి, 20న పల్లెపహాడ్‌లో ఆయా గ్రామపంచాయతీ కార్యాలయాల వద్ద సదస్సులు నిర్వహిస్తున్నామని భూ సమస్యల పరిష్కారానికి రెవెన్యూ అధికారులే గ్రామాలకు వస్తున్నారని అన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఘనంగా బొడ్రాయి పండుగ



పూజలు నిర్వహిస్తున్న విప్ అయిలయ్య

బొమ్మలరామారం : మండలంలోని హాజీపూర్ గ్రామంలో ఆదివారం బొడ్రాయి పండుగ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య, ఆలేరు మాజీ ఎమ్మెల్యేలు గొంగిడి సునీత మహేందర్‌రెడ్డి, బూడిద భిక్షమయ్యగౌడ్ వేర్వేరుగా పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గ్రామస్తులు భక్తిశ్రద్ధలతో గ్రామదేవతలకు బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ తిరుమల కవితా వెంకటేష్‌గౌడ్, మార్కెట్ కమిటి మాజీ డైరెక్టర్ రామిడి రాంరెడ్డి, పలువురు నాయకులు పాల్గొన్నారు.


ఎమ్మెల్యే చిత్రపటానికి పాలాభిషేకం



ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న నాయకులు

భువనగిరి : బస్వాపురం రిజర్వాయర్ ముంపుకు గురవుతున్న బీఎన్ తిమ్మాపురం గ్రామంలోని ఇళ్ల నష్టపరిహారం గురించి స్పందించి నిధులను వెంటనే విడుదల చేసేందుకు కృషి చేసిన ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డికి ఆ గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా గ్రామంలో ఆయన చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ జిన్న మల్లేష్, మాజీ సర్పంచ్ రావుల నందు, గ్రామ శాఖ అధ్యక్షుడు పిన్నెం శ్రీశైలం, నాయకులు గణేష్, గంగాదేవి బాలరాజ్, రమేష్, అశోక్, నర్సింహ ఉన్నారు.

మహిళా సమైక్య కమిటీ ఎన్నిక



రచ్చ పల్లవి

ఆత్మకూరు(ఎం) : మండల కేంద్రంలో ఆదివారం మహిళా సమైక్య మండల కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. మండల అధ్యక్షురాలిగా మండల కేంద్రానికి చెందిన రచ్చ పల్లవి, కార్యదర్శిగా గుండు మాధవి(సిద్ధాపురం), కోశాధికారిగా దుంప కవిత(రహీంఖాన్‌పేట)తో పాటు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా రచ్చ పల్లవి మాట్లాడుతూ.. మహిళలు బ్యాంక్ రుణాలను సద్వినియోగం చేసుకుంటూ ఆర్థికంగా బలోపేతం కావాలని కోరారు. సమావేశంలో ఏపీఎం పక్కీరయ్య, సీసీలు భాస్కర్, వెంకన్న, కంప్యూటర్ ఆపరేటర్ చంద్రస్వామి తదితరులు ఉన్నారు.

రక్తదాన శిబిరం



రక్తదాన శిబిరంలో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు

రామన్నపేట : మండల కేంద్రంలో కాంగ్రెస్ నాయకులు ఆదివారం ఎమ్మెల్యే వేముల వీరేశం జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలోని రోగులకు పండ్లు పంపిణీ చేశారు. అనంతరం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో రక్తదాన శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో మార్కెట్ వైస్‌చైర్మన్ సిరిగిరెడ్డి మల్లారెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ నంద్యాల భిక్షంరెడ్డి, గంగుల వెంకటరాజిరెడ్డి, బత్తుల కృష్ణ, కూనూరు సాయికుమార్, గంపల రామచంద్రారెడ్డి, మద్దెపురి ఐలయ్య, గోగు హరిప్రసాద్, పున్న రమేష్, గుత్తా నర్సింహారెడ్డి, గోదాసు పృథ్వీరాజ్, వనం చంద్రశేఖర్, ఎండీ రెహాన్, ఎండీ అక్రం, జమీరొద్దీన్, జెల్ల వెంకటేశం, చల్ల సత్యప్రకాష్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మామిడి పచ్చడి.. మజాయే వేరు!

ఏ ఇంట్లో చూసినా పచ్చడి ఘుమఘుమలే..

- దిగివచ్చిన పుల్లటి మామిడి
- సైజును బట్టి కాయ రూ.5 నుంచి రూ.10
- పేద, మధ్య తరగతి ప్రజలకు అందుబాటులో ధరలు



సంస్థాన్ నారాయణపురంలో మామిడికాయ పచ్చడి తయారు చేసుకుంటున్న ఓ కుటుంబ సభ్యులు

సంస్థాన్ నారాయణపురం : ఎన్ని కూరలున్నప్పటికీ పచ్చడి మెతుకులు లేనిది గొంతులోకి ముద్ద దిగదు అన్నట్లుగా నిల్వ మామిడికాయ పచ్చడికి పేరుంది. పచ్చళ్లతో పూట గడుపుకొనే ఎంతో మంది పేదవారు ఉన్నారు. గత సంవత్సరం నుంచి మామిడికాయ పచ్చడి తయారీలో ఉపయోగించే ధరలు పోల్చితే ఈ సారి ఖర్చు చౌకగా మారింది. చాలా మంది ఇంట్లో మామిడికాయలు పచ్చళ్లలు పెట్టుకుంటే, వీలుకాని వారు పచ్చళ్లలు కొనుగోలు చేస్తుంటారు. మే నెల 25నుంచి రోహిణి కార్తె రావడంతో ప్రజలు మామిడికాయ పచ్చడి పెటుకోవడానికి సిద్ధమవుతున్నారు. రోహిణి కార్తెలో పచ్చళ్లు పెట్టుకోవడం వల్ల కార్తె బలంతో మామిడికాయ ముక్కలు సంవత్సరం పాటు గట్టిగా ఉండి, పచ్చడి నిల్వ ఉంటుందని చాలా మంది నమ్మి ఆసక్తి చూపుతారు.

తగ్గిన ధరలు

మామిడికాయ పచ్చళ్ల వారి అభిరుచికి అనుగుణంగా వివిధ రకాలుగా పచ్చళ్లను పెట్టుకుంటారు. మామిడికాయలతో ఉడకబెట్టిన పచ్చళ్ల, కొబ్బరి, వేరశనగకాయ, నువ్వులు, ఆవాలు, అల్లం, తొక్క తీసిన మామిడికాయలతో పలు రకాలుగా పచ్చళ్లను పెడుతుంటారు. పచ్చళ్ల తయారీలో పలు వస్తువులను ఉపయోగిస్తారు. తయారీలో ఉపయోగించే వస్తువులు గత సంవత్సరం కంటే ప్రస్తుతం భారీగా పెరిగాయి. కొని వస్తువుల ధరలు రెట్టింపు కంటే ఎక్కువగా పెరిగాయి. గత సంవత్సరం 100 మామిడి కాయలతో పచ్చళ్లు పెట్టడానికి రూ.5000 వేల నుంచి రూ.7500 వరకు ఖర్చు చేశారు. ప్రస్తుతం రూ.3వేలు నుంచి రూ.3,500 వరకు ఖర్చు వస్తుంది. గత సంవత్సరం తక్కువ కాయలతో పచ్చళ్లు పెట్టుకున్నారు., మరికొందరు అవసరానికి అనుగుణంగా పచ్చళ్ళ కొనుగోలు చేశారు. ప్రస్తుతం ధరలు దిగిరావడంతో ప్రస్తుతం ఎక్కువ కాయలతో పచ్చళ్లు పెట్టే అవకాశం ఉంది. కింది పట్టికలో 100 మామిడికాయలతో పచ్చళ్ల తయారు చేయడానికి సుమారు అయ్యే ఖర్చు వివరాలు. ఇవే కాకుండా మెంతులు, ఆవాలు, ఉప్పు, వేరుశనిగ, కొబ్బరి వంటి వస్తువులు స్వల్పంగా ధరలు మార్పులు ఉండగా, మరి కొన్ని వస్తువులు గత సంవత్సరం ధరలు ఉన్నాయి.

ధరల వివరాల పట్టిక

వస్తువు పేరు	గత సంవత్సరం ధర రూ.	ప్రస్తుతం ధర రూ.
1.మామిడికాయ(100)	1000-2000	500-1000
2. ఎండు మిర్చి (3కేజిల ప్రకారం) లేదా	900-2400	300-1200
3. ఎండు కారం (2కేజీలు)	900-1600	350-1000
4. పల్లి నూనే (4 లీటర్లు)	560-700	560-600
5. అల్లం (2కేజీలు)	400-500	80-100
6. ఎల్లిగడ్డ (2కేజీలు)	400-500	150-200
7. జిలుకర (250గ్రామాలు)	175-200	75-100

కలిసిమెలిసి పచ్చళ్ల తయారీ..

వేసవి కాలం వచ్చిందంటే నిల్వ పచ్చళ్లు పెట్టడం సంప్రదాయంగా పాటిస్తున్నారు. మామిడికాయ పచ్చళ్లను లక్ష్మిదేవి స్వరూపంగా భావిస్తూ నిష్టతో పెడతారు. వేసవిలో మామిడికాయ, నిమ్మకాయ పచ్చళ్లను ఎక్కువగా పెడుతుంటారు. వేసవి కాలం వచ్చిందంటే పచ్చళ్ల పెట్టడం ఓ పండుగలా ఇంటి సభ్యులు, పరిచయస్తులతో కలిసి పచ్చళ్ల పెట్టడంలో భాగస్వాములవుతారు. మామిడికాయ పచ్చళ్ల ను ప్రాంతం ఆధారంగా పలు పేర్లతో పిలుస్తుంటారు. తెలంగాణ యాసలో మామిడికాయ తొక్కు, ఆంధ్రాలో ఆవకాయ అంటూ పిలుస్తుంటారు. మన పచ్చళ్ల కు దేశ, విదేశాలలో కూడా అభిరుచి కలిగిన వారు ఉన్నారు. మామిడికాయ పచ్చడి పెట్టాలంటే కొంత అనుభవం అవసరం. అనుభవం లేకుండా పెడితే పచ్చడి బూజు రావడం, ఉప్పు లేదా కారడం కావడం లేదా రుచి లేకపోవడంతో జరుగుతుంది. అందుకే పద్ధతిగా పచ్చడి పెడుతుంటారు. పచ్చడి పెట్టుకోవడానికి వీలు కాని వారి కోసం, వివిధ కంపెనీలు లేదా కొంత మంది పచ్చళ్లు తయారు చేసి అమ్మకం చేస్తుంటారు.

రూ.120కే కిలో మిరపకాయలు కొనుగోలు చేశా



గత సంవత్సరం మామిడి కాయ పచ్చళ్ళ పెటు కోవడానికి చాలా ఖర్చు వచ్చింది. కే మిర్చి రూ.400 చొప్పున 2కేజీల ఎండు మిర్చి కొనుగోలు చేసి పచ్చడి పెట్టినాను. ప్రస్తుతం కేజీ ఎండు మిర్చి రూ.120ల చొప్పున 5కేజీల మిర్చి కొనుగోలు చేశాను. గత సంవత్సరంతో పోల్చుకుంటే సగానికి పైగ ధరలు తగ్గాయి.

– మారగోని యాదమ్మ , అరెగూడెం

ధరలు భారీగా తగ్గాయి



మామిడికాయ పచ్చడి పెట్టడానికి అవసరమైన వస్తువుల ధరలు గత సంవత్సరంతో పోల్చితే భారీగా తగ్గాయి. కారం, ఎండు మిర్చి, ఎల్లిగడ్డ, అల్లం, జిలుకర ధరలు భారీగా తగ్గాయి. నూనే, ఇతర వస్తువులలో స్వల్ప ధరల మార్పు ఉంది. రోహిణి కార్తె నుంచి పచ్చళ్ల వస్తువులు ధరలు అమ్మకం పెరుగుతుంది.

– గజవెళ్లి రమేష్, కిరాణం షాపు నిర్వహకుడు, జనగాం

ప్రారంభమైన బ్రహ్మోత్సవాలు

రాజాపేట : మండలంలోని రఘునాథపురం గ్రామంలో శ్రీదేవి భూదేవి సమేత శ్రీవేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు ఆదివారం భక్తిశ్రద్ధలతో ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఉదయం విష్ణుసహస్ర నామ పారాయణం, విష్వక్సేన ఆరాధన, పుణ్యావాహచనం, రక్షా బంధనం, అంకురార్పన, గ్రామ దేవత ఆరాధన వంటి కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ చింతకింది రామదాసు, వైస్ చైర్మన్ రాచకొండ స్వామి, ఉత్సవ కమిటీ అధ్యక్షుడు వల్లకాటి బాబురావు, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు, మహిళలు పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎన్నిక

రామన్నపేట : మండలంలోని కొమ్మాయిగూడెం గ్రామంలో సీపీఐ గ్రామకమిటీ సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సమావేశంలో పార్టీ గ్రామ కమిటీని మండల కార్యదర్శి ఊట్కూరి నర్సింహ, సహాయ కార్యదర్శి ఎర్ర రమేష్‌గౌడ్ ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గ్రామ శాఖ కార్యదర్శిగా రేపాక లింగస్వామి, సహాయ కార్యదర్శిగా పెండెం రవీందర్, కోశాధికారిగా ఎర్ర భిక్షపతి కమిటీ సభ్యులుగా రచ్చ యాదగిరి, రెబ్బస్ రాములు, ఆకిటి శంకర్, ఎర్ర కిరణ్, గిరుకల ఢిల్లిబాబు, ఎర్ర అండాలు, ఎర్ర చక్రపాణి, కొత్త శ్యాం, బండమీద కృష్ణయ్య, రుకుణమ్మను ఎన్నుకున్నారు.

రాష్ట్ర అవతరణ వేడుకలకు సిద్ధం

ఆత్మకూరు(ఎం) : మండలంలో రాష్ట్ర అవతరణ వేడుకలను జరుపుకోవడానికి అధికారులు సిద్ధం చేస్తున్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వ కార్యాలయాలను మామిడి తోరణాలతో ముస్తాబు చేస్తున్నారు. మండల కేంద్రంతో పాటు గ్రామాల్లోనూ గ్రామ పంచాయతీ కార్యాలయాల వద్ద, పాఠశాలల వద్ద, అంగన్‌వాడీ కేంద్రాల వద్ద, ఆరోగ్య కేంద్రం సబ్ సెంటర్‌ల వద్ద, పాల కేంద్రాల వద్ద జాతీయ పతాకాలను ఎగురవేయడానికి అధికారులు ఏర్పాటు చేశారు.

యాక్షన్ ప్లాన్ పకడ్బందీగా అమలు చేయాలి



భువనగిరిటౌన్ : సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ రామలింగం

భువనగిరిటౌన్ : తెలంగాణ ప్రభుత్వ ఆదేశాల మేరకు మున్సిపాలిటీలో 100రోజుల యాక్షన్ ప్లాన్ పకడ్బందీగా అమలు చేయాలని మున్సిపల్ కమిషనర్ జి.రామలింగం ఆదేశించారు. ఆదివారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. 100 రోజుల ప్రణాళికలో భాగంగా మొత్తం 51 యాక్టివిటీస్ ఉంటాయని, ఈ నెల 2నుంచి సెప్టెంబర్ 10వరకు వివిధ రకాల కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. వంద రోజులు ప్రణాళికలో అధికారులు, సిబ్బంది అందుబాటులో ఉండి పూర్తిస్థాయిలో అమలు చేయాలని, ప్రజా ప్రతినిధులు, పట్టణ ప్రజలు ప్రజలందరూ సహకరించాలని కోరారు. సమావేశంలో డీఈ కొండల్ రావు, అధికారులు, మెప్మా ఆర్పీలు ఉన్నారు.

100రోజుల ప్రణాళిక విజయవంతం చేయాలి

మోత్కూరు : మున్సిపాలిటీలో వంద రోజుల ప్రణాళిక కార్యక్రమాలను విజయవంతం చేయాలని మున్సిపల్ కమిషనర్ కె.సతీష్‌కుమార్ అన్నారు. ఆదివారం మున్సిపల్ కార్యాలయంలో వంద రోజుల ప్రణాళిక పనులపై సిబ్బందికి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ నెల 2నుంచి 10 సెప్టెంబర్ వరకు 100రోజుల కార్యక్రమంలో భాగంగా శానిటేషన్, నాశాల క్లీనింగ్, ఇంకుడు గుంతలు, పాడైన రహదారుల మరమ్మతులు, పిచ్చిమొక్కల తొలగింపులు, శిథిలావస్థలో ఉన్న భవనాల గుర్తింపు, మంచినీటి ట్యాంకులు శుభ్రం చేయుట, దోమల నివారణ కోసం పాగించేయుట, అసెస్మెంట్లు, తడి పొడి చెత్తల సేకరణ, పొదుపు సంఘాలకు రుణాలు, మంచినీటి ట్యాంకుల్లో క్లోరినేషన్ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. సమావేశంలో మేనేజర్ ప్రభాకర్, జూనియర్ అసిస్టెంట్లు, వార్డ్ ఆఫీసర్లు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.


బీజేపీ బలోపేతమే లక్ష్యంగా పనిచేయాలి



నియామకపత్రం అందజేస్తున్న కల్పనయాదవ్

చౌటుప్పల్ : బీజేపీ నాయకులు, కార్యకర్తలు పార్టీ బలోపేతమే లక్ష్యంగా పనిచేయాలని ఆ పార్టీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు కంచర్ల గోవర్ధన్‌రెడ్డి, మున్సిపల్ కమిటీ అధ్యక్షురాలు కడారి కల్పనయాదవ్ అన్నారు. ఆదివారం స్థానికంగా నిర్వహించిన సమావేశంలో పట్టణానికి చెందిన వంగాల రమాకాంత్‌ను పార్టీ మున్సిపల్ కమిటీ ఉపాధ్యక్షుడిగా నియమిస్తూ నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. వచ్చే మున్సిపల్ ఎన్నికలే లక్ష్యంగా పని చేయాలన్నారు. కార్యక్రమంలో కట్ట కృష్ణ, కాసుల వెంకటేశం పాల్గొన్నారు.

శిథిల భవనాలకు నోటీసులు



పురాతన ఇళ్లకు అంటించిన నోటీసులు

భువనగిరిటౌన్ : రానున్న వర్షాకాలంతో శిథిల భవనాలతో ప్రమాదం పొంచి ఉన్నాయి. ఈ నేపథ్యంలో భువనగిరి మున్సిపాలిటీ టౌన్‌ప్లానింగ్ ఆధ్వర్యంలో సర్వే చేసి 35శిథిల ఇళ్లను గుర్తించి యజమానులకు నోటీసులు జారీచేశారు. సర్వేలో ప్రమాదకర ఇళ్లను గుర్తించి నోటీసులు ఇవ్వనున్నట్లు అధికారులు తెలిపారు. ప్రమాదకరంగా ఉన్న ఇళ్లను స్వయంగా కూల్చివేసుకోవాలని లేకుంటే మేమే కూల్చివేస్తామని నోటీసులో పేర్కొంటున్నారు. గతంలోను సుమారు 30భవనాలను తొలగించారు.

యువతను మోసం చేస్తున్న ప్రభుత్వాలు



సమావేశంలో మాట్లాడుతున్న ధర్మేంద్ర

వలిగొండ : యువతను మోసగిస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఉద్యమించాలని ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కల్లూరు ధర్మేంద్ర అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో నిర్వహించిన ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలు దేశానికే ప్రమాదమని, ఆర్ఎస్ఎస్ విధానాలతో పాలించడంతో దేశం వెనక్కి వెళ్తుందని, ఇలాంటి పరిపాలనను యువత తిప్పికొట్టాలని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అందజేయనున్న యువ వికాసం అర్హులైన యువతకు అందజేయాలని, ప్రభుత్వం ఆపరేషన్ కగార్‌ను నిలిపివేసి మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలని కోరారు. పాలకులు అవలంబిస్తున్న యువజన వ్యతిరేక విధానాలపై పోరాటాలు నిర్వహిస్తామన్నారు. సమావేశంలో ఎల్లంకి మహేష్, మారోజు నర్సింహాచారి, సాయికుమార్, మేడి దేవేందర్, నరేష్, కార్తీక్, కృష్ణకుమార్ పాల్గొన్నారు.

పెండింగ్ పాల బిల్లులు వెంటనే చెల్లించాలి



మాట్లాడుతున్న కల్లూరి రాంచందర్‌రెడ్డి, పక్కన మదర్ డెయిరీ మాజీ చైర్మన్ శ్రీకర్‌రెడ్డి

యాదగిరిగుట్ట : మూడు నెలలుగా పెండింగ్‌లో ఉన్న మదర్ డెయిరీ పాల బిల్లులను వెంటనే చెల్లించాలని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు కల్లూరి రాంచందర్‌రెడ్డి, మదర్ డెయిరీ మాజీ చైర్మన్ లింగాల శ్రీకర్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. నియోజకవర్గంలోని పాడి రైతులు అధికంగా నార్మూల్ మదర్ డెయిరీలో పాలను పోస్తున్నారని, కానీ వారికి మూడు నెలలుగా పాల బిల్లులు అందక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఇప్పటికైనా సీఎం రేవంత్‌రెడ్డి స్పందించి ఈ నెల 5వరకు పాల బిల్లుల బకాయిలను చెల్లించి పాడిరైతులను ఆదుకోవాలన్నారు. లేదంటే పాల రైతులతో కలిసి పార్టీ ఆధ్వర్యంలో ఉద్యమించాల్సి వస్తుందన్నారు.

వైభవంగా బొడ్రాయి వార్షికోత్సవం



బొడ్రాయి వద్ద పూజలు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

రామన్నపేట : మండలంలోని మునిపంపుల గ్రామంలో ఆదివారం బొడ్రాయి తృతీయ వార్షికోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు బొడ్రాయికి అభిషేకాలు చేసి బోనాలను నైవేద్యంగా సమర్పించారు. అదే విధంగా గ్రామదేవతలకు పూజలు నిర్వహించి బోనాలను సమర్పించారు. ఈ ఉత్సవాల్లో మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్సవ నిర్వాహకులు ఆయనను ఘనంగా సన్మానించారు. ఉత్సవాల్లో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పోచబోయిన మల్లేశం, మాజీ ఎంపీటీసీ గాదె పారిజాత ముకుందం, నాయకులు మామిడి పద్మారెడ్డి, కమ్మంపాటి శ్రీనివాస్, దోగిపర్తి జానకిరాములు, సాల్వేరు అశోక్, మామిండ్ల అశోక్, మామిండ్ల కుమార్, ఉడతల శ్రీను, బత్తుల వెంకటేశం, బొలుగుల కృష్ణ, వర్కాల రమేష్, గంగాధర శ్రీను, మేకల రాములు, నల్ల సైదులు, కిన్నెర మహేష్, తదితరులు పాల్గొన్నారు.

డ్రైయినేజీలు లేక ఇబ్బందులు



మార్కండేయ నగర్‌లో డ్రైయినేజీలు లేక నిలిచిన మురుగునీరు

భూదాన్‌పోచంపల్లి : పట్టణంలోని మార్కండేయ నగర్‌లో డ్రైయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. పలు వీధుల్లో డ్రైయినేజీలు లేకపోవడంతో మురుగునీరు ఇళ్ల ముందు నిలుస్తుండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మురుగునీరు నిలిచి దుర్వాసన వెదజల్లుతుంది. అంతేకాక సాయంత్రం వేళలో దోమలు విజృంబించి రోగాల బారిన పడుతున్నామని కాలనీవాసులు వాపోతున్నారు. ఈ విషయమై మున్సిపల్ అధికారులకు పలుమార్లు విన్నవించినా పట్టించుకోవడంలేదని, ఇకనైనా సంబంధిత అధికారులు స్పందించి కాలనీలో డ్రైయినేజీ సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



యాదగిరిగుట్ట రూరల్ : సమ్మేళనంలో పాల్గొన్న విద్యార్థులు



రామన్నపేట : లక్ష్మాపురంలో..

యాదగిరిగుట్ట రూరల్ : మండలంలోని చొల్లేరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 2004–05 విద్యాసంవత్సరంలో పదోతరగతి పూర్తి చేసుకున్న విద్యార్థులు ఆదివారం పాఠశాలలో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అప్పటి ఉపాధ్యాయులను శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో అప్పటి హెచ్ఎం రాజారామ్, ఉపాధ్యాయులు సత్తయ్య, శేఖర్‌రెడ్డి, శంకరాచారి, వెంకటేషం, మాజీ సర్పంచ్ తోటకూరి బీరయ్య, పూర్వ విద్యార్థులు ప్రేమ్‌సాగర్, ప్రవీణ్, సిద్దులు సత్యనారాయణ, ప్రశాంతి, శ్రీలత, భరత్, స్వాతి, జ్యోతి, వెంకటేష్, కిరణ్ తదితరులు ఉన్నారు.

రామన్నపేట : మండలంలోని మునిపంపుల జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన 2010–11బ్యాచ్ విద్యార్థులు ఆదివారం పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం పాఠశాల ఆవరణలో జరుపుకున్నారు. 15ఏళ్ల తరువాత కలుసుకున్న వారు ఒకరినొకరు ఆత్మీయంగా పలుకరించుకొని యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. తమకు విద్యాబుద్దులు నేర్పిన ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో నాటి హెచ్ఎం తాటి చంద్రమౌళి ఉపాధ్యాయులు పగిడిపాటి నర్సింహ, బాసరాజు యాదగిరి, శ్రీరంజన్, బ్రహ్మచారి, ఇంతియాజ్‌అహ్మద్, బాలక్రిష్ణ, మహేశ్వరి, మధు, రమాదేవి పాల్గొన్నారు.

భువనగిరి : పట్టణంలోని శ్రీలక్ష్మీనర్సింహాస్వామి డిగ్రీ కళాశాలలో 1997–2000 బ్యాచ్‌కు చెందిన డిగ్రీ బీఏ విద్యార్థులు ఆదివారం స్థానికంగా కళాశాలలో ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం కార్యక్రమాన్ని జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఒక్కరినొక్కరి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. నాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుని ఆటపాటలతో ఆనందంగా గడిపారు. అనంతరం నాటి అధ్యాపకులను సన్మానించారు. కార్యక్రమంలో అనిత, కళ్యాణి, జయరాణి, శశికళ, విజయలక్ష్మి, సంగీత, లలిత, అనురాధ తదితరులు పాల్గొన్నారు.

అనాజీపురంలో..

మండలంలోని అనాజీపురం జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో 2009–2010 బ్యాచ్‌కి చెందిన పదోతరగతి విద్యార్థులు స్థానికంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం కార్యక్రమాన్ని జరుపుకున్నారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు శ్రీకాంత్, సురేష్, నరేష్, రాఘవేందర్, శివ, సంతోష్, నాగరాజు, హరిలాల్, అనుష, శ్వేత, మంజుల తదితరులు పాల్గొన్నారు.



భువనగిరి : అధ్యాపకులతో పూర్వ విద్యార్థులు



భువనగిరి : అనాజీపురంలో ..

ఆర్థికసాయం అందజేత

మోత్కూర్ : మండలంలోని ముశిపట్ల గ్రామానికి చెందిన మేడి నరసింహ కుమారుడు మేడి ప్రమోద్ అనారోగ్యంతో ఇటీవల మృతిచెందాడు. ఆదివారం కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు పైళ్ల సోమిరెడ్డి బాధిత కుటుంబాన్ని పరామర్శించి రూ.5వేల ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో ముశిపట్ల గ్రామ శాఖ అధ్యక్షులు కొల్లు రమేష్, మాజీ సర్పంచ్ తండ సత్తయ్య, కెమిడి సైదులు, మండల ప్రధాన కార్యదర్శి బుషిపాక రమేష్, బుషిపాక భిక్షం, బుషిపాక కిష్టయ్య పాల్గొన్నారు.

ముమ్మరంగా రోడ్డు విస్తరణ పనులు



ఆత్మకూరు(ఎం)లో జరుగుతున్న డబుల్ రోడ్డు నిర్మాణ పనులు

ఆత్మకూరు(ఎం) : మండల కేంద్రంలో డబుల్ రోడ్డు విస్తరణతో పాటు సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. డబుల్ రోడ్డు నిర్మాణ పనులకు ప్రభుత్వం రూ.1.75కోట్ల నిధులు మంజూరు చేసింది. మోత్కూరు–రాయిగిరి రోడ్డుపై మెయిన్‌రోడ్డు నుంచి జెడ్పీ ఉన్నత పాఠశాల వరకు సుమారు కిలోమీటరున్నర వరకు నిర్మాణం చేయనున్నారు. ప్రస్తుతం మెయిన్ రోడ్డు నుంచి అంగడి ప్రాంతం వరకు బీటీ రోడ్డు మధ్య నుంచి ఇరువైపులా 18ఫీట్ల చొప్పున ఒక ఫీటు లోతు మట్టిని తీసి మెటల్ నిర్మాణ పనులు చేపడుతున్నారు. అంగడి ప్రాంతం నుంచి జెడ్పీ ఉన్నత పాఠశాల వరకు బీటీరోడ్డు మధ్య నుంచి ఇరువైపులా 12ఫీట్ల వరకు మెటల్ నిర్మాణ పనులు సాగుతున్నాయి. అందులో భాగంగా ప్రస్తుతం స్కూల్ వరకు ఒక వైపు మెటల్ రోలింగ్ నిర్మాణ పనులు పూర్తి చేశారు. మరో పక్క ఒక ఫీటు మట్టిని తీసే పనులు చేపడుతున్నారు. ఎట్టకేలకు డబుల్‌రోడ్డు నిర్మాణ పనులు శరవేగంగా చేపడుతుండడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.